# బంజారాల సాంస్కృతిక జీవన విధానం - నాడు నేడు

డా. హెచ్. కిషన్, రీడర్ ఇన్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.

**ప్రారంభం :** బంజారాల జీవన విధానం నాడు ఒక విలక్షణమైన పద్ధతిలో ఉండి మిగతా సమాజాల కంటే భిన్నంగా ఉండేటివి. ఈ జీవన విధానమనేది ఒక తరం నుండి మరొక తరానికి కట్టుబాటుగా వస్తుంది. సంచార జాతి, అడవికి సమీపంలో చిన్న చిన్న గూడారాలు నిర్మించుకొని జీవనాన్ని కొనసాగించారు. కాని నేడు అందరు చదువుకుంటున్నారు. అడవి నుండి పట్టణానికి వలస వచ్చి జీవిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరి జీవన విధానంలో కాలం నేడు అనేక మార్పులు చోటుచేసుకొంది. జననం నుండి మరణం వరకు ఎదగడం ఆయుధం పట్టడం, షికార్లు చేయడం, జంతువులను వేటాడటం మొదలైనవి ఉన్నాయి. నేడు ఆ చేతులతోనే కలం పట్టి రాస్తున్నారు. సాంస్కృతి సాంప్రదాయాల్లో ఆచార వ్యవహారాల్లో ఇలా ఎన్నో వారి జీవన విధానంలో మార్పులు వచ్చాయి. వాటిలో కొన్నిటిని పరిశీలిస్తాను.

**ప్రసూతి ఆచారాలు :** పూర్వం బంజారాల్లో గర్భిణి స్త్రీ బయటి వైద్యుడ్ని సంప్రదించరు. తమ తండాలోని మంత్రసానితోని సంప్రదించి ఆమె చెప్పిన నాటు మందులను వాడుతారు. తమ సమీపంలోని చెరువు కట్టపైన మట్టిని తింటారు. గర్భిణి స్త్రీకి కోరుకున్నా వంటలు చేసి పెట్టటం పని చేయకుండా ఇంట్లోనే ఉండి తినడం సాధ్యం కాదు. కష్టజీవులు ఈ సంచార జాతుల్లో కష్టం. ఆమె ప్రసవించే వరకు కాయ కష్టం చేసుకుంటూ జీవించవలసిందే. మొదటి కాన్పు తల్లిగారింట్లో చేయాలనే ఆచారం వీళ్ళకు లేదు. సీమంతం చేయడం ఉండదు. పూరి గుడిసేల్లోనే ప్రసవిస్తుంది. నేడు బంజారాల్లో గర్భిణి స్త్రీ ప్రైవేటు, ప్రభుత్వ వైద్యాన్ని సంప్రదిస్తున్నారు. మంత్రసాని సహాయం లేకుండా డాక్టర్ల సలహాల మేరకు మందులు వాడుతున్నారు. ఆహారం కూడా వారు చెప్పినట్లే తింటున్నారు. సీమంతం అనే వేడుకను కొన్నిచోట్ల ఘనంగా జరుపుకుంటున్నారు. ఇది బంజారాల్లో ప్రపంచీకరణ ప్రభావంతో నేడు కాలం తెచ్చిన మార్పులు.

**బాలెంత కాయం :** వాము, లవంగాలు, మిరియాలు, కాయపు దినుసులు, సొంటి, తులసిచెట్టు వేర్లుకాని అన్నీ కలిసి బాగా రుబ్బి బెల్లం ఆవు నెయ్యిలో కాయం చేసి తాగిస్తారు. నేడు పై వాటికి బదులు పండ్లు, ఫ్రూట్స్ మొదలగునవి తినిపిస్తున్నారు.

**బలెంత పథ్యం :** ప్రసూతైనా రోజు బాలంతకు బియ్యం పిండి, నెయ్యి, బెల్లంతో తయారుచేసిన ప్రత్యేకమైన పాయసాన్ని తయారు చేసి తాగిస్తారు. పాయసం తాగించడం వల్ల బాలింత శరీరంలో మలిన రక్తం పోయి శక్తి వచ్చి ఆరోగ్యంగా ఉంటారని వీరి నమ్మకం. నేడు ఆరోగ్యంగా ఉండటానికి వివిధ రకాల మందులను వాడుతున్నారు.

**పురుడు తంతు :** నాడు మగపిల్లవాడుగాని, ఆడపిల్లగాని పుట్టిన మూడు రోజులలో పురుడు చేస్తారు. నేడు పుట్టిన రోజు ఘనంగా చేసుకుంటున్నారు.

**వాతలు పెట్టే తంతు :** నాడు శిశువు పుట్టిన పదకొండో రోజు ఆముదపు దీపం మీద సూది మొనకాల్చి బొడ్డు చుట్టూ రెండు వాతలు వేస్తారు. ఈ విధంగా వెయ్యడం వల్ల శిశువుకు భవిష్యత్తులో ఎలాంటి కడపునొప్పి లాంటివి రావని, త్రాగిన తల్లి పాలు జీర్ణమవుతాయని నమ్ముతారు. నేడు కడపు నొప్పిలాంటివి వస్తే డాక్టరును సంప్రదించి మందులు వాడుతున్నారు.

బంజారాలు సాంస్కృతిక జీవన విధానంలో వివాహానికి సంబంధించి ఆచారాలు ఉన్నాయి. వాటిలో కొన్నిటిని వివరిస్తాను.

**వివాహాచారాలు :** మానవ జీవితంలో అత్యంత ప్రధానమైనది వివాహబంధం. ఇది స్త్రీ పురుషులను మానసికంగా, శారీరకంగా సాంస్కృతికంగా కట్టివేసే బలమైన బంధం దీనినే విజ్ఞులు దాంపత్య బంధమంటారు. ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాల సాధనకు వివాహమే ఉత్తమమైన మార్గం నిశ్చితార్థం తంతు మొదలుకొని అప్పగింతల తంతు వరకు ఉంటుంది.

**నిశ్చితార్థం తంతు :** నిశ్చితార్థం అనే తంతు పూర్వం బంజారాల్లో అన్ని తెగల్లో కంటే భిన్నంగా ఉండేది. దీనినే బెల్లం తినే తంతు అని అర్థం. చుట్టూ ప్రక్కల తండా నాయకుల సమక్షంలో ఈ నిశ్చితార్థం తంతు జరుపుతారు. వివిధ తండాల నుండి వచ్చిన బంధువులు, తండా నాయకుని సమక్షంలో జరుపుతారు. అందరు ఒకే దగ్గర కూర్చొని బెల్లం తింటారు. నల్లకల్లు తాగుతారు. బీడీలు తండా నాయకునికి ఇస్తారు. ఆకు వక్క ఇస్తారు. నిశ్చితార్థానికి అయిన ఖర్చులను చెరిసగం పంచుకుంటారు. నేడు బంజారాల్లో నిశ్చితార్థం తంతు వివిధ ఫంక్షన్ హాల్లో జరుపుకుంటున్నారు. ఖర్చులకు భయపడకుండా ఎవవరికి వారే పెట్టుకొని ఘనంగా చేసుకుంటున్నారు.

**పెళ్ళి కొడుకు తంతు :** నాడు పెళ్ళి కొడుకును ఆదివారం మాత్రమే బట్టలు కట్టించే తంతు. అనగా పెళ్ళి కొడుకును అలంకరించే విధానం ఇతర సమాజానికి భిన్నంగా తంతు ఉంటుంది. కాని నేడు బంజారాల్లో పెళ్ళి కొడుకును తయారు చేసే విధానంలో అనేక మార్పులు వచ్చాయి. తండా నాయకుడే పెళ్ళి పౌరోహిత్యం చేయటం బంజారాల సంప్రదాయమైనప్పటికి నేడు గ్రామీణుల్లాగానే బ్రాహ్మణులను పిలిచి పెళ్ళిళ్ళు జరిపించుకుంటున్నారు.

**వడగు మంత్రం తంతు :** ఒక సూదిని తీసుకొని మోదుగు కాడకు గుచ్చి దీపం మీద కాల్చి వడగు మంత్రం చదువుతూ సూదితో అన్నదమ్ముల మోచేతి భుజం మీద వాతలు వేస్తారు. ఈ వడగు మంత్రాన్ని ఏడుసార్లు పఠిస్తారు. దీని అర్థం ఏమిటి అంటే భవిష్యత్తులో ఎలాంటి కష్టాలు వచ్చిన లెక్క చేయకుండ ధైర్యంగా ముందుకు సాగి జీవితాన్ని చక్కదిద్దుకోవాలని సందేశం ఇస్తారు. నేడు ఈ మంత్రానికి బదులు తెలుగు పురోహితుడు. వేద మంత్రాలు చదివి పెళ్ళి చేస్తున్నారు.

**పానకం తీసే తంతు** : ఈ తంతును ఆదివారం రాత్రి జరుపుతారు. తండాలోని స్త్రీ పురుషులను ఆహ్వానిస్తారు. అందరు వచ్చిన తర్వాత వాళ్ళందరికి సరిపోయేంత బెల్లం, గసాల శొంఠి, మిరియాలు, కొబ్బరి కుడుకలు మొదలగునవి బాగా రుబ్బి నీటిలో కలిపి పానకాన్ని తయారు చేస్తారు. ఆ పానకాన్ని ముందు తండా నాయకుడు స్వీకరిస్తాడు. తరువాత అందరు స్వీకరిస్తారు. స్త్రీలు పాటలు కూడ పాడతారు. నేడు ఇవి అన్ని కలిపి తయారుచేసిన బెల్లాన్ని వరుడు చేత వధువు తల మీద పెట్టిస్తున్నారు.

**కుండల తంతు** : తండా సమీపంలోనున్నా గ్రామానికి వెళ్ళి కుమ్మరికి కుండలను తయారు చేయమని చెప్పివస్తారు. తెచ్చిన కుండలను ఇంటి ముందు నాలుగు వైపులా పాతిన గుంజల వద్ద ఉంచి చుట్టూ జిల్లేడు కొమ్మలతో అలంకరించి కింద పడిపోకుండా తాడుతో గట్టిగా కడతారు. దాని తరువాత తండాలో చిన్నా పెద్ద తేడా లేకుండా ఆ కుండలను ఒక్కొక్కరు బలంగా లాక్కొని తీసుకొని పోతారు. నేడు ఈ ఆచారానికి బదులు పెళ్ళిలో పురోహితుడు నాలుగు చిన్న చిన్న కుండలు నాలుగు వైపుల పెట్టి దారాలు కట్టి పెళ్ళి మంత్రాలు చదువుతూ చేస్తున్నారు.

**స్నానం తంతు** : ముత్తైదువలు వధువుకు పసుపు పూసి చల్లటి నీళ్ళతో స్నానం చేయిస్తారు. నేడు వధువు బాత్ రూమ్‌లో వెళ్ళి స్నానం చేసుకొని వస్తున్నారు.

**పెండ దిబ్బకు మొక్కే తంతు** : వరుడు వధువును పెండకుప్ప దగ్గరికి తీసుకెళ్ళి మొక్కిస్తారు. ఈ విధంగా చేయడం ద్వారా నవదంపతులకు ఎవరి దిష్టి తగలకుండా ఉండాలని మొక్కి వచ్చేస్తారు. నేడు ఈ ఆచారానికి బదులు నల్లటి కాటుక పెట్టుకుంటున్నారు.

**గాజులు తొడిగించే తంతు** : బంజారాల్లో వధువును ఎప్పుడైతే అత్తగారింటికి పంపిస్తారో అప్పుడే రెట్టలకు గాజులు తొడిగించే తంతు జరుపబడుతుంది. నేడు పెండ్లి ముహూర్తం పెట్టిన తరువాత ముందు రోజు సమీపంలో నున్న పట్టణానికి వెళ్ళి వధువు చేతులకు గాజులు తొడుక్కొని వస్తున్నారు.

**విందు భోజనం తంతు** : నాడు బంజారాల్లో భోజనం చేసేటప్పుడు అందరు సమానమేనని నిరూపించుకోవడానికి, అమ్మాయి తరపున ఐదుగురు నాయకులు, అబ్బాయి తరపున ఐదుగురు నాయకులు ఒకే పళ్ళెంలో భోజనం చేస్తారు. నేడు ఫంక్షన్ హాల్‌లో వివిధ రుచికరమైన వంటలు వండిరచుకొని వివిధ తండా నాయకులతో పాటు బంజారేతర వాళ్ళు కూడా వచ్చి భోజనం చేస్తున్నారు. నేడు వీరి జీవన విధానంలో చాల మార్పులు వచ్చాయని చెప్పవచ్చు.

**పెద్దలను పూజించే తంతు** : పెళ్లి తంతు అంత అయిపోయిన తర్వాత పెండ్లి కుమారుడు తమ ఇంటికి బయలుదేరే ముందు తండా నాయకులను తాంబూలం ఇచ్చి పాదనమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకొని బయలుదేరుతారు. నేడు పెద్దవాళ్ళ ఆశీస్సులు తీసుకోకుండా కారులో, బస్సులో బయలుదేరి అమ్మాయిని తీసుకొని ఇంటికి వచ్చేస్తున్నారు.

**అప్పగింతల తంతు :** పెండ్లి కుమార్తె సామాగ్రిని గోనె సంచిలో వేసి ఎడ్ల బండిలో పెడతారు. పెళ్ళి కూతురు వెళ్ళేముందు తండాలోని వారిని తలచుకుంటూ అందరికి నమస్కరిస్తూ అత్తవారింటికి బయలుదేరి వస్తుంది. ఎదురుగా వెళ్ళి వధూవరులను ఇంట్లోకి ఆహ్వానిస్తారు. సాయంత్రం పెళ్ళి కుతూరు తెచ్చిన వస్త్రాలు తీసి చూసి మెచ్చుకుంటారు. దీనితో తంతు ముగిసిపోతుంది. నేడు పెళ్లి కుమార్తె వస్తువులను ఎడ్ల బండికి బదులు బస్సులో ఏదైన వాహనంలో తీసుకొని వస్తున్నారు.

**మరణం తంతు :** ''జాతస్య మరణం ధ్రువమ్'' అని గీతాకారుడన్నట్లు పుట్టిన ప్రతి మనిషి చనిపోక తప్పదు. పంచభూతాల వల్ల ఏర్పడిన శరీరం తిరిగి పంచభూతాల్లోనే కలుస్తుంది. కాబట్టి చనిపోవటాన్ని ''పంచత్వం పొందటం'' అన్నారు. పుట్టిన రోజు ఆనందం హద్దులు మీరుతుంది. చనిపోయిన రోజు ప్రతి హృదయం చెరువై దుఃఖం కట్టలు తెంచుకుంటుంది. కాబట్టి ''కష్ట సుఖాలే కావడికుండలు'' అని లోకోక్తి ఏర్పడింది.

**పాడె తంతు :** బంజారాల్లో ఎవరైన చనిపోతే శవం నోట్లో బెల్లం ముక్కను పెడతారు. స్నానం చెయిస్తారు. దాని తరువాత శవాన్ని మోసుకొని పోవటానికి పాడె కడతారు. పాడె మీద శవాన్ని పెట్టి తెల్లటి బట్టకప్పి పేనిన త్రాడును బిగించి కడతారు. నేడు పాడెకు బదులు వాహనం పైన తీసుకెళ్తున్నారు.

**బట్టలు తంతు :** చనిపోయింది పురుషుడైతే అతని భార్యకు కొత్త బట్టలు ధరింపచేస్తారు. ఆమెను ముత్తైదువను చేసి ఆ లాంఛనాలను ఒక్కొక్కటి తీసివేస్తారు. ఆ రోజు నుండి ఆమెకు పూలు, రంగు వస్త్రాలు ధరించడానికి అర్హత ఉండదు. రెట్టగాజులు కూడా వేసుకోవడానికి వీలు లేదు. నేడు వేసుకొని తిరుగుతున్నారు. దేనికంటే సమాజానికి భయపడి బొట్టుపెట్టుకొని భర్త ఉన్నట్లు నటించుకుంటు జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

**శకునం తంతు :** శవాన్ని తీసుకొని పోయేటప్పుడు కాని, వచ్చేటప్పుడు కాని, పాము కాని, తేలు గాని కుట్టినా, కనిపించినా, లేదా ఏదైన కర్రగాని, రాయిగాని తాకి రక్తం కనిపించిన అపశకునంగా భావించి, వెంటనే అందరు ఒక దగ్గర కూర్చొని నిర్ణయం తీసుకొని మేకపోతును బలి ఇచ్చి రక్తాన్ని అందరు చూసి, అక్కడ్నె వండుకొని తిని వస్తారు. ఇలా చేస్తే అపశకునం తొలగిపోతుందని వారి విశ్వాసం. నేడు మూఢనమ్మకమని నమ్మడం లేదు.

**మూడవరోజు తంతు :** మంగళవారం కాని, ఆదివారం కాని ఎవరైనా చనిపోతే అదేరోజు దహన సంస్కారాలు చేస్తారు. అయిన వెంటనే ఒక యాటను బలి ఇస్తారు. మిగత రోజులలో చనిపోతే మూడవ రోజున కర్మను చేస్తారు. దీనినే పిట్టకు పెట్టడం అంటారు. బియ్యం పిండితోకాని, జొన్న పిండితో కాని రొట్టెలు చేసి అందులో బెల్లం కలిపి నెయ్యితో ముద్దలు చేస్తారు. ముందు కాకులకు పెట్టిన తరువాత తలొకటి ముద్దను తీసుకొని తింటారు. మిగిలిన ముద్దలను ఇంటికి తీసుకురాకుండ అక్కడే చెట్టుకు కట్టి వస్తారు. నేడు ఈ ఆచారంలో చాల మార్పులు వచ్చాయి. అందరు చదువుకుంటున్నారు, మూఢనమ్మకాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

**తొమ్మిదవరోజు తంతు :** తొమ్మిదవ రోజు బంధువర్గం వారు అందరు కలిసి డబ్బులు వసూలు చేసుకొని రెండు మూడు యాటలను కోసి వంట చేసి కుటుంబంలో నున్న వాళ్ళందర్ని బాధను మరచిపోవడానికి తినిపిస్తారు. ఈ రోజుతో కర్మకండ తంతు ముగిసినట్లే తరువాత ఇంట్లో నుంచి బయటికి వచ్చి తమ పనులు చేసుకుంటారు. అందరితో మాట్లాడుతారు. క్రమముగా దుఃఖంను మరచిపోతారు. ఇంతటితో చావుతంతు ముగిసిపోతుంది. నేడు చనిపోయిన వెంటనే ఇంట్లో ఉండకుంటా బయటికి వచ్చి తమ పనులు చేసుకుంటున్నారు. ఇది కాలం తెచ్చినా మార్పుగా భావించవచ్చు.

**నమ్మకాలు - విశ్వాసాలు :** నాడు బంజారాల్లో సాంస్కృతిక జీవన విధానంలో మత ప్రభావం అధికంగా ఉంటుంది. వీరు తమ మతాన్ని అపారమైన భక్తి భావంతో ప్రేమిస్తారు. వీరు తమ కులదేవతలతో పాటు ఇతర దేవతలను కూడ ఆరాధిస్తారు. అందువల్ల వీరి దేవతల సంఖ్య కొంచెం అధికంగా ఉంటుందని చెప్పవచ్చు. వీరు కులదేవతలను పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తే అనేక రకాల వ్యాధులు, మరణాలు, తదితర నష్టాలు సంభవించే అవకాశం ఉంటుందని వీరి ప్రగాఢ విశ్వాసం. అందువల్ల వీరి దేవతలను తృప్తిపర్చి శాంతిపరుస్తారు. కాని నేడు వీరి దేవతలను దూరం పెడ్తున్నారు. ఏదైన వ్యాధి వస్తే ముందుగా దేవతలకు మొక్కకుండ, దవాఖానాకు వెళ్ళుతున్నారు. ఇంత చదువు చదివి ఇంకా ఈ నమ్మకాల్లేంటి అని నిర్లక్ష్యం చేసి అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**ముగింపు :** బంజారాల్లో సాంస్కృతిక జీవన విధానంలో నాడు పైన పేర్కొన్నవి కొన్ని మాత్రమే వివరించాను. ఇంతకు ముందు చెప్పినట్లుగా వీరి జీవన విధానం చాలా విలక్షణంగా సంస్కృతీ కరించబడిన జాతుల పద్ధతులకు విభిన్నంగా ఉంటాయి. నేడు కాలనియతికి లోబడి ప్రస్తుతం ఈ పద్ధతులన్నీ అటకెక్కుతున్నాయి. ఇది చాల బాధకరమైన విషయంగా భావించవచ్చు. నేడు ప్రపంచీకరణ ప్రభావంతో బంజారాల జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**


1. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి - చీనియా నాయక్
2. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ - డా. సూర్యాధనంజయ్
3. సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు - డా. ఎం. గోనానాయక్
4. వరంగల్ జిల్లా బంజారా సాహిత్యం - సాంస్కృతిక అధ్యయనం (అముద్రిత గ్రంథం)
   - డా. హెచ్.కిషన్
5. బుడిగె జంగాలు, భాషాసాహిత్యం - సాంస్కృతికాంశాల పరిశీలన
   - డా. ఎన్.ఆర్. వెంకటేశం
6. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - జనపాల శంకరయ్య.